క్లుప్తంగా

నేత్రదానానికి ముందుకు రావాలి



అభినందన పత్రం అందిస్తున్న చందర్

జ్యోతినగర్: ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్ర, అవయవ దానానికి ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో ఇటీవల వడదెబ్బతో మృతి చెందిన ఈదునూరి కిషోర్ నేత్రాలను కుటుంబ సభ్యులు సోమవారం దానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం నేత్రదాత కిషోర్ సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, పట్టణ ప్రధాన కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర, అవయవ, దేహదానంపై అవగాహన కల్పించారు. మాట్లాడారు. అనంతరం నేత్రదాత కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ అభినందన పత్రాన్ని అందజేశారు. మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్ రమణారెడ్డి, అడ్వకేట్ పూర్మ శ్రీనివాస్, నాయకులు ఈదునూరి పర్వతాలుతోపాటు నేత్రదాత తల్లిదండ్రులు ఉమ్మయ్య–శంకరమ్మ పాల్గొన్నారు.

ఆలయ పునర్ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న రఘువీర్‌సింగ్

జూలపల్లి: పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ తండ్రి మహావీర్ సింగ్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళర్పించారు. ఈ సందర్భంగా జూలపల్లిలోని కొండ పోచమ్మతల్లి ఆలయ పునర్ నిర్మాణానికి రూ.25వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సంపత్‌సింగ్, రణ్‌వీర్‌సింగ్, నాయకులు లోక రవీందర్‌రెడ్డి, మంద అంజయ్య, మెండె రాజయ్య, మల్లేశం, పొలగాని సతీశ్, సిరికొండ కొమురయ్య, అంకూస్ లచ్చయ్య, అబ్బూమియా ఉన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన హర్షవర్ధన్, రిషివర్ధన్, అభినవ్ నాలుగు గోల్డ్ మెడల్, ఒక కాంస్య పతకం అందుకున్నట్లు మాస్టర్ సతీశ్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ కరాటే మార్షల్ ఆర్ట్స్ కుంగ్ ఫూ, ఛాంపియన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ లీగ్‌లో సుల్తానాబాద్‌కు చెందిన మంకీ ఫిస్ట్ కుంగ్ ఫూ అకాడమీ నుంచి ముగ్గురు కరాటే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు మాస్టర్ పేర్కొన్నారు.

ఎంఆర్‌సీకి చేరిన పాఠ్య పుస్తకాలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి పాఠ్య పుస్తకాలు చేరాయి. సోమవారం సీఆర్‌పీలు ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ప్రభుత్వం నుంచి ఎన్ని వచ్చాయని పరిశీలిస్తున్నారు. పట్టణంతోపాటు మండలంలో ఉన్న పీఎస్‌లు, యూపీఎస్‌లు, హైస్కూల్‌లోని 2366 మంది విద్యార్థులకు 16,013 పుస్తకాలు వచ్చినట్లు వెల్లడించారు. మండలంలో చదువుతున్న విద్యార్థులందరికీ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, మంగళవారం ప్రతి పాఠశాలకు నోట్‌బుక్స్ చేరవేస్తామని ఎంఈవో సురేందర్ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు కిరణ్‌గౌడ్, రాంచందర్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రియాంక ఉన్నారు.

నేత్రదానం మహాదానం



డోనర్ కార్డులతో సింగరేణి ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ: అన్నిదానాల్లో నేత్రదానం మహా దానమని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అన్నారు. సోమవారం ప్రపంచ నేత్రదాన దినోత్సవం సందర్భంగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్జీ–2ఏరియా సింగరేణి (వీటీసీ) శిక్షణ కేంద్రంలో నూతన ఉద్యోగులకు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి నేత్ర, శరీర, అవయవదానాలపై అవగాహన కల్పించారు. కాగా 50 మంది సింగరేణి కార్మికులు నేత్రదానానికి ముందుకు రాగా వారికి వీటీసీ మేనేజర్ మురళీకృష్ణ చేతుల మీదుగా డోనర్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ప్రవీణ్, నరసింహచారి, రాజమహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

సేంద్రియ సాగు.. దిగుబడి బాగు

- రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ
- ఏటా పెరుగుతున్న సాగువిస్తీర్ణం
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



రైతు పొలంలో సాగు చేసిన జీలుగ

పాలకుర్తి: రైతులు సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఏటా వ్యవసాయ పంటల సాగులో భాగంగా విచ్చలవిడిగా ఉపయోగిస్తున్న రసాయనిక ఎరువులతో పాటు క్రిమిసంహారక మందుల ధాటికి భూమిలో సారం తగ్గి ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రావడం లేదు. అయితే రసాయనికి ఎరువులకు స్వస్తి పలికి భూమిని సారవంతం చేసే దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే రైతులు సేంద్రియ ఎరువుల సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు..

ఒకప్పుడు సాగుకు ముందు రైతులు భూమిని సారవంతం చేసేందుకు గేదెలు, మేకలు, గొర్రెలు తదితర పశువుల పేడతో పాటు కోళ్ల ఎరువును సైతం ఉపయోగించేవారు. దీంతో భూమి సారవంతమై సాగు చేసిన పంటలు చీడ పీడలను తట్టుకునేవి. తద్వారా తక్కువ పెట్టుబడితో రైతులు అధిక దిగుబడులు పొందేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాల్లో సైతం పశుపోషణ పూర్తి స్థాయిలో తగ్గి కనీసం పశువుల పేడ దొరకని పరిస్థితి నెలకొంది. ఒకవేళ దొరికినా వారి నుంచి కొందామంటే ఒక ట్రాక్టర్ ఎరువుకు దాదాపు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ఖర్చు అవుతోంది. పైగా ఒక ట్రాక్టర్ ఎరువు 10గుంటల నుంచి అర ఎకరం విస్తీర్ణానికే సరిపోతుంది. ఈలెక్కన ఒక ఎకరాకు రూ.6 నుంచి రూ.8వేల వరకు ఖర్చు అవుతుంది. కాగా రైతులు తక్కువ ఖర్చుతో సాగయ్యే సేంద్రియ ఎరువుల సాగుపై దృష్టిసారిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పంటలను ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేస్తోంది. దీంతో ఖరీఫ్ సాగుకు ముందు రైతులు జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి సేంద్రియ ఎరువుల పంటలను సాగు చేసి భూసారాన్ని పెంచుకుంటున్నారు.

తక్కువ ఖర్చు.. ఎక్కువ విస్తీర్ణంలో సాగు

మండల పరిధిలోని గ్రామాల్లో ఏటా పచ్చిరొట్టి పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే ఈ పంటలపై రైతులు ఆసక్తి చూపున్నారు. గతేడాది మండలవ్యాప్తంగా దాదాపు వెయ్యి ఎకరాలలో పచ్చిరొట్టె సాగు చేశారు. గతంలో మండల పరిధిలోని రైతులకు సహకార సంఘాల ద్వారా సబ్సిడీపై సేంద్రియ విత్తనాలను అందించగా ప్రస్తుతం డీసీఎంఎస్ ద్వారా విత్తనాలను అందిస్తున్నారు. ఇప్పటివరకు పుట్నూర్ గ్రామంలోని డీసీఎంఎస్ బ్రాంచ్ ద్వారా 100 బ్యాగుల జనుము, 418 బ్యాగుల జీలుగు విత్తనాలు రైతులకు రాయితీపై అందించినట్లు మండల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఒక్కో బ్యాగు దాదాపు రెండున్నర ఎకరాల విస్తీర్ణానికి సరిపోతుంది. ఈ లెక్కన దాదాపు 1300 ఎకరాలలో పచ్చిరొట్టె పంటలు సాగైనట్లు అంచనా.

అవగాహన కల్పిస్తున్నాం



పచ్చిరొట్టె పంటలు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని ఇస్తాయి. వీటిని సాగు చేయడంతో భూమి గుల్లబారి సారవంతమవుతుంది. తద్వారా అధిక దిగుబడి పొందేందుకు అవకాశం ఉంటుంది. రైతులు వీటిని సాగుచేయడం ద్వారా పొందే ప్రయోజనాల గురించి అవగాహన కల్పిస్తున్నాం.

– ప్రకాశ్, మండల వ్యవసాయాధికారి

భగీరథ కనెక్షన్లపై ఇంటింటి సర్వే



సర్వే చేస్తున్న ఎంపీవో సుదర్శన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో సోమవారం మిషన్ భగీరథ కనెక్షన్ల ద్వారా ఇంటింటికీ తాగునీటి సరఫరాపై ఇంటింటి సర్వే చేపట్టారు. మండలంలోని నిట్టూరు, పెద్దబొంకూర్, నిమ్మనపల్లి, పెద్దకల్వల తదితర గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఎంపీవో సుదర్శన్, ఏపీవో రమేశ్‌బాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలి

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి తాగునీటి నల్లా కనెక్షన్లు సర్వే చేసి అప్‌లోడ్ చేయాలని ఎంపీడీవో దివ్యదర్శన్ సంబంధిత అధికారులకు సూచించారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో నల్లా కనెక్షన్ సర్వేను సోమవారం నిర్వహించగా ఎంపీడీవో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఉందా, ఉంటే సరిపడా నీళ్లు వస్తున్నాయా, నల్లా కనెక్షన్ లేకున్నా సర్వే చేసి లైవ్ ఫొటోతో కూడిన వివరాలను ప్రభుత్వం రూపొందించిన మిషన్ భగీరథ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు వివరించారు. ఒక ఇంటిలో ఒక కుటుంబం కంటే ఎక్కువగా ఉన్న వారి వివరాలను కూడా సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని గ్రామాల్లో పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ అధికారులు ఉన్నారు.

ఓదెలలో..

ఓదెల: ఓదెల గ్రామంలో ఎంపీడీవో తిరుపతి ఆధ్వర్యంలో మిషన్ భగీరథ మంచినీటి కనెక్షన్‌పై సోమవారం సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటిలో మిషన్ భగీరథ, జీపీ మంచినీటి సౌకర్యం ఉందా లేదా అని సర్వే చేశారు. గ్రామంలో పూర్తిగా మంచినీటి కనెక్షన్ లేని వారి గురించి ఆరా తీశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఓదెల ఎంపీవో భాస్కర్, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

జూలపల్లి: మండల కేంద్రం నుంచి పెద్దపల్లి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ జూలపల్లి నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు చెప్పి ఏడాది కావస్తున్నప్పటికీ పనులు ప్రారంభించకపోవడం శోచనీయమని ఆరోపించారు. రోడ్డు నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించకపోతే జూలపల్లి నుంచి పెద్దపల్లి వరకు పాదయాత్ర నిర్వహించి నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. పార్టీ నాయకులు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, జ్యోతిబసు, అశోక్‌గౌడ్, దొడ్ల రాజయ్య, మేరుగు కనుకయ్య, బైరరాజమల్లు, సంకెన్ల నర్సయ్య, శంకరయ్య ఉన్నారు.

సీనియారిటీ ఆధారంగా పదోన్నతి కల్పించాం



మాట్లాడుతున్న సూర సమ్మయ్య

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికులకు సీనియార్టీ ఆధారంగానే కాంట్రాక్ట్ బేసిక్ కార్మికులుగా పదోన్నతి కల్పించారని కేశోరాం కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య అన్నారు. సోమవారం బసంత్‌నగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం కార్మికులను రెచ్చగొడుతూ తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ప్రకటించిన 25మంది బేసిక్‌లలో తమ యూనియన్ తరఫున కేవలం ముగ్గురు కార్మికులకు మాత్రమే పదోన్నతి కల్పించారని, మిగతా వారందరికి సీనియార్టీ ఆధారంగానే పదోన్నతి లభించిందన్నారు. గతంలో కంపెనీలో పనిచేసిన కార్మికసంఘాలు కూడా ఇదే రీతిన వ్యవహరించాయన్నారు. తనపై రాజకీయ దురుద్దేశంతోనే ప్రతిపక్ష నాయకులు ఒక కుట్రపూరితంగా అవినీతికి పాల్పడ్డానని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, కార్మికులు గమనించాలని కోరారు. గడిచిన రెండేళ్లలో కార్మిక సంఘం నాయకుడిగా కార్మికుల సంక్షేమం, వారి హక్కుల సాధనకోసం యాజమాన్యంతో పోరాటం చేసి ఎన్నో హక్కులను సాధించామని, ఎలాంటి అవినీతికి తావులేకుండా నిస్వార్థంగా సేవ చేశామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తలారి శంకర్, శిలగాని రాజేశం, రాజ్‌కుమార్, కుమార్, సతీశ్‌యాదవ్, చంద్రమౌళి, షకీలాల్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం పలువురు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ 200 యూనిట్ల విద్యుత్ మినహాయింపు రాని వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. పలు సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందేలా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సహకారంతో ముందుకు వెళ్తామని వివరించారు. కౌన్సిలర్ తిరుపతి, అధికారులు ఉన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



గోదావరిఖని: టపాసులు పేల్చుతున్న నాయకులు

గోదావరిఖని: మూడోసారి భారతదేశ ప్రధానిగా నరేంద్రమోడీ, రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సోమవారం బీజేపీ నాయకులు స్థానిక ప్రధాన చౌరస్తాలో సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సోమారపు అరుణ్‌కుమార్, లావణ్య, సునీల్, గాదె సురేందర్, మింగాని అశోక్, సతీశ్‌యాదవ్, బండారి శ్యామ్ పాల్గొన్నారు. అలాగే బీజేపీ ఆధ్వర్యంలో గడపగడపకూ మిఠాయిల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కాకతీయనగర్‌లో నాయకురాలు మాతంగి రేణుక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మామిడి రాజేశ్, కొమ్ము శ్రీనివాస్, మామిడి సంపత్, రాజేశ్, కుమ్మరి మల్లేశ్, వడ్డేపల్లి సదానందం, వడ్లూరి రాము కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్గాంలో..

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ కూడలిలో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు బాణాల స్వామి ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. అదేవిధంగా నియోజకవర్గ ఇన్‌చార్జి, పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆమె అభిమానులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. బీజేపీ ప్రతినిధులు పెంద్రు మల్లారెడ్డి, మాడ ప్రభాకర్‌రెడ్డి, ఆవుల విజయ్‌పాల్‌యాదవ్, బాలసాని సత్తయ్యగౌడ్, నరేందర్, అంగడాల రాజయ్య, అంగోతు లాల్‌నాయక్, గొల్లూరి పురుషోత్తం, బోకం రాజు, నాగరాజు, రఘు, యోగి, మల్లెపల్లి రవి ఉన్నారు.

ఎలిగేడు: ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో సోమవారం మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ సీనియర్ నాయకులు గర్రెపల్లి నారాయణస్వామి, గాదె రంజిత్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఇల్లందుల పర్శరాములుగౌడ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు అమరగొండ గంగయ్య, బీజేవైఎం మండల అధ్యక్షులు రాయపాక మనోహర్, మండల ప్రధాన కార్యదర్శి మల్లారపు అంజయ్య, నాయకులు అడ్డగుంట తిరుపతిగౌడ్, ఊర జనార్ధన్‌రావు, వంగ శ్రీకర్, భూర్ల జనార్దన్, రాజకుమార్, సాగర్ పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మతల్లి పట్నాలు



ఎల్లమ్మతల్లి జోగెత్తుట

ఎలిగేడు: మండల కేంద్రంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరేణుక ఎల్లమ్మతల్లి పట్నాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎల్లమ్మతల్లి జోగెత్తుట అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈనెల 11న మంగళవారం ఎల్లమ్మతల్లి బోనాలు, 12న బుధవారం ఎల్లమ్మతల్లి పట్నం కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షుడు అడ్డగుంట శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఏగోలపు నాగరాజుగౌడ్, కార్యవర్గ సభ్యులు రంగు శ్రీనివాస్‌గౌడ్, గుర్రం మల్లేశంగౌడ్, బుర్ర గణేశ్‌గౌడ్, అడ్డగుంట రాములు, బుర్ర వెంకటేశ్, గుర్రం విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ముల్మూరి శ్రీనివాస్

రామగిరి: సింగరేణి సంస్థలో 25ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏ గనిలో సోమవారం పర్యటించి కాంట్రాక్టు కార్మికులతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, మౌళిక వసతులు కల్పించాలన్నారు. కాంగ్రెస్ కాంట్రాక్టు కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో బీజేపీ పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెంటనరీకాలనీ పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, కాంట్రాక్టు కార్మికులు శ్రీకాంత్, రాము, సురేశ్, సంతోష్, కోటి పాల్గొన్నారు.

పిల్లలను సర్కారు బడిలో చేర్పించండి



కమాన్‌పూర్: అవగాహన కల్పిస్తున్న కళాబృందం

కమాన్‌పూర్: సర్కార్ బడుల్లో పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలంగాణ సాంస్కృతిక కళాబృందం సభ్యులు పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని పేరపల్లిలో సోమవారం బడిబాట కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాబృందం సభ్యులు కోండ్ర వెంకన్న, ఇల్లందుల మల్లేశ్, జనగామ రాజనర్సు, ఇదునూరి పద్మ, బుర్ర శంకర్‌గౌడ్, సలేంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, శ్రీవల్లి, రమ, రేణుక పాల్గొన్నారు.

ఎలిగేడులో బడిబాట

ఎలిగేడు: మండలంలో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని ఆయా ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చేపట్టారు. బడిబాటలో ఇప్పటి వరకు 103 మందిని గుర్తించి నమోదు చేసినట్లు ఎంఈవో కవిత తెలిపారు. ఎలిగేడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం దేవేందర్‌రావు, సుల్తాన్‌పూర్, ధూళికట్ట జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎంలు సదయ్య, నరేంద్రచారి, సీఆర్పీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలను నియంత్రించండి



వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో వసూలు చేయాల్సిన ఫీజుల వివరాలు తెలిపే బోర్డులు అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని కోరారు. డొనేషన్లు, స్పెషల్ ఫీజులు, బస్ ఫీజు, యూనిఫాం, అడ్మిషన్ ఫీజులంటూ అడ్డగోలుగా వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నాయని విమర్శించారు. అధికారులు స్పందించి నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ప్రవీణ్, యతిరాజు అజయ్, రిషి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి

రామగిరి: అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని మంథని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద కోరారు. సోమవారం మండలంలోని కల్వచర్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాలుగేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సమతుల్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు గుడ్లు, బాలామృతం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వేముల రజిత, జి.అనసూర్య, డి.రమాదేవి పాల్గొన్నారు.

ఎన్టీపీసీ అంగన్‌వాడీ కేంద్రంలో బడిబాట

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో సోమవారం అంగన్‌వాడీ బడిబాట నిర్వహించారు. పర్మనెంట్ టౌన్‌షిప్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టు రామగుండం అర్బన్ అధికారుల సూచన మేరకు అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. టీచర్ సుజాత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పలత, యువరత్న పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జనగామ తిరుపతి మాట్లాడారు. కార్యక్రమంలో సుజాత, పుష్ప, స్వప్న, లలిత, పిల్లల తల్లిదండ్రులు జహీరాబాను, సరిత, సుజాత, శ్రావ్య, రవీందర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ధర్మారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సీజనల్ వ్యాధులతో పాటు టీబీ వ్యాధి నిర్మూలన, సీసీజీ టీకాపై మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుస్మిత ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 18ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికీ బీసీజీ వ్యాక్సినేషన్ వేయడానికి ఆశావర్కర్ల ద్వారా మండలంలో సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈఎస్ విజయలలిత, సూపర్‌వైజర్ జయ, జీవరాణి మలేరియా నోడల్ పర్సన్ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓదెల ఏవోగా రాంబాబు




ఓదెల: ఓదెల వ్యవసాయాధికారిగా బి.రాంబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పదేళ్ల క్రితం ఏవోగా పనిచేసిన నాగార్జునను కాల్వశ్రీరాంపూర్‌కు బదిలీ చేశారు. అంతర్గాం మండలంలో పనిచేసిన ఏవో రాంబాబు ఓదెలలో బాధ్యతలు స్వీకరించారు.

ఇంటింటా తాగునీరు అందించడమే లక్ష్యం

సుల్తానాబాద్: ఇంటింటా తాగునీరు అందించడమే లక్ష్యమని సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్య దర్శన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ సర్వే కోసం వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. తాగునీటికి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

‘పీఎంను విమర్శించడం మానుకోవాలి’



మాట్లాడుతున్న రాజన్న పటేల్

సుల్తానాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని విమర్శించడం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మానుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజన్న పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని పేర్కొన్నారు. మండల మాజీ అధ్యక్షుడు రఘుపతిరావు, మండల ప్రధాన కార్యదర్శులు నల్లవెల్లి శంకర్, నర్సింగోజు రమేశ్‌చారి, పట్టణ మాజీఅధ్యక్షుడు ఎల్లంకి రాజన్న, మహేశ్ పటేల్, బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మల్కా భాగ్యలక్ష్మి, బీజేపీ ఉపాధ్యక్షులు సాయిచరణ్, వెంకటేశ్, బూత్ అధ్యక్షులు మారం రమేశ్, చిన్న, వేణుయాదవ్, వేణు, సతీశ్, సంపత్, సాయి తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామంలో పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు సోమవారం మరమ్మతు పనులు చేపట్టారు. ‘మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు పగుళ్లు’ శీర్షికన ‘సాక్షి’ దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సిబ్బందితో వచ్చి పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు చేయించారు.